సాక్షి శ్రీకాకుళం

శుక్రవారం । 2 । ఫిబ్రవరి । 2024



చంద్రబాబుది గురివింద నీతి

చంద్రబాబుపై ధర్మాన కృష్ణదాస్ విమర్శలు ఎక్కుపెట్టారు. ఆయనది గురివింద నీతి అని దుయ్యబట్టారు. -IIలో



హిమ ప్రతాపం

పొగమంచు రోజురోజుకూ పెరుగుతోంది. బారెడు పొద్దెక్కినా ఎండ కనిపించనీయకుండా కమ్ముతోంది. -IIలో

ముగిసిన జేఈఈ పరీక్షలు

ఎచ్చెర్ల క్యాంపస్: జిల్లాలోని రెండు పరీక్ష కేంద్రాల్లో ఫిబ్రవరి 27 నుంచి జరుగుతున్న జేఈఈ మెయిన్స్ పరీక్షలు గురువారంతో ముగిశాయి. చిలకపాలెంలో శ్రీ శివానీ ఇంజినీరింగ్ కాలేజ్ ఆన్‌లైన్ పరీక్ష కేంద్రానికి మొదటి షిఫ్టులో 100 కి 98, రెండో షిఫ్టులో 100 కి 97 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఎచ్చెర్లలోని శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ కాలేజీలో మొదటి షిఫ్టులో 100 కి 98, రెండో షిఫ్టులో 100 కి 97 హాజరయ్యారు. మొత్తం 400 మందికి 390 మంది హాజరయ్యారు. గత నెల 27వ తేదీ నుంచి పనిదినాల్లో నిర్వహించిన పరీక్షలకు 2000 మందికి గాను 1972 మంది హాజరయ్యారు.

న్యూస్‌రీల్

కొత్త కలెక్టర్‌కు ఘన స్వాగతం



కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్‌కు స్వాగతం పలుకుతున్న జేసీ నవీన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాకు కొత్త కలెక్టర్‌గా నియమితులైన మనజీర్ జిలానీ సమూన్‌కు జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, ఎస్పీ జీఆర్ రాధిక ఇతర అధికారులు గురువారం ఘన స్వాగతం పలికారు. కొత్త కలెక్టర్ గురువారం శ్రీకాకుళం చేరుకున్నారు. ఆయనకు ఆర్ అండ్ బీ వసతి గృహం వద్ద అధికారులు ఘన స్వాగతం పలికారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, అసిస్టెంట్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, డీఆర్‌ఓ ఎం.గణపతిరావు, డీఎస్పీ వై.శృతి, ఆర్డీఓలు ఎస్.భరత్ నాయక్, సీహెచ్ రంగయ్య, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చల్లా ఓబులేసు, రెవెన్యూ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కె.శ్రీరాములు, తదితరులు ఉన్నారు. అలాగే శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా నియమితులైన తమీమా అన్సారియాకు కూడా అధికారులు స్వాగతం పలికారు.

హోరాహోరీగా ఆడుదాం ఆంధ్రా పోరు



హోరాహోరీగా సాగుతున్న కబడ్డీ పోరు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఆడుదాం ఆంధ్రా పోటీలు ఆద్యంతం హోరాహోరీగా సాగుతున్నాయి. జిల్లా కేంద్రంలోని కోడిరామ్మూర్తి స్టేడియం ప్రాంగణం వేదికగా జిల్లాస్థాయి పోటీలు మొదలయ్యాయి. వాలీబాల్, కబడ్డీ, క్రికెట్ క్రీడాంశాల్లో గురువారం సాయంత్రంతో పోటీలు ముగిశాయి. విజేతలకు ట్రోఫీలు బహూకరించారు. కాగా నేటి నుంచి ఖోఖో, బ్యాడ్మింటన్ (డబుల్స్) క్రీడాంశాల్లో పోటీలు మొదలుకానున్నాయి. ఇందుకు జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారులు ఏర్పాట్లు చేశారు. నాణ్యమైన భోజనంతోపాటు, మెరుగైన మౌలిక సదుపాయలు కల్పించి పోటీలు నిర్వహించినందుకు క్రీడాకారులు సంతోషం వ్యక్తం చేశారు. డీఎస్‌డీఓ డాక్టర్ కె.శ్రీధర్‌రావు, ఒలింపిక్ సంఘ జిల్లా కార్యదర్శి ఎం.సాంబమూర్తి, పీఈటీ సంఘ జిల్లా అధ్యక్షుడు ఎంవీ రమణ, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ బీవీ రమణ, పీడీలు, శాప్, డీఎస్‌ఏ కోచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి విజేతల వివరాలు..

వాలీబాల్ పురుషులు: విజేతగా ఎచ్చెర్ల, రన్నరప్‌గా శ్రీకాకుళం, తృతీయ స్థానంలో ఆమదాలవలస నియోజకవర్గాలు నిలిచాయి.

వాలీబాల్ మహిళలు: పలాస, ఆమదాలవలస, పాతపట్నం నియోజకవర్గాలు మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి.

క్రికెట్ పురుషులు: ఇచ్ఛాపురం, నరసన్నపేట, శ్రీకాకుళం నియోజకవర్గాలు మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి.

క్రికెట్ మహిళలు: టెక్కలి విజేతగా, ఎచ్చెర్ల రన్నరప్‌గా నిలిచాయి.

కబడ్డీ పురుషులు: శ్రీకాకుళం, ఆమదాలవలస, పలాస నియోజకవర్గాలు మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి.

కబడ్డీ మహిళలు: పలాస, పాతపట్నం, ఎచ్చెర్ల నియోజకవర్గాలు మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి.

బ్రహ్మాండ నాయకుడి బ్రహ్మోత్సవం



స్వామికి పూజలు జరిపిస్తున్న వేద పండితులు

పర్లాకిమిడి: ఒడిశా రాష్ట్రం పర్లాకిమిడి సమీపంలోని ఆర్.సీతాపురం సెంచూరియన్ వర్సిటీ ప్రాంగణంలో ఉన్న శ్రీవిద్యా వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా బుధవారం ప్రారంభమయ్యాయి. దీనిలో భాగంగా గురువారం గుసాని సమితి మచ్చమర గ్రామంలోని మహేంద్రతనయ నుంచి సెంచూరియన్ విద్యార్థినులు 108 కలశాలతో పవిత్ర జలం తీసుకువచ్చారు. వర్సిటీ ఉపాధ్యక్షుడు ఆచార్య డి.ఎన్.రావు, పద్మ దంపతులు స్వామివారికి కలశ స్నానం చేసి ప్రసాదాలు పంచిపెట్టారు. సాయంత్రం స్వామికి శ్రీదేవి, భూదేవి సమేతంగా తిరువీధి ఉత్సవం, గరుడ వాహన సేవను రూసూరు గ్రామం వరకు నిర్వహించారు. ఉత్సవాలు ప్రధాన పూజారి అరవెల్లి శేఖరాచార్యులు, చామర్తి శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో జరుగుతున్నాయి.

● వేకువన..
సంక్షేమ వేడుక



- పండగలా పింఛన్ల పంపిణీ
- ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేసిన వలంటీర్లు

గోడపై క్యాలెండర్ పేజీ మారిన రోజునే లబ్ధిదారు చేతికి సర్కారు పింఛను అందుతోంది. ఇంకా సూరీడి వెలుగు కూడా ఊరికి చేరక మునుపే పింఛన్‌దారు ముఖంలో నవ్వు ప్రకాశిస్తోంది. ఒకప్పుడు ఇదే పింఛన్ కోసం మండలాఫీసుల్లో గంటల తరబడి కూర్చున్న వృద్ధులు, కమిషన్ ఇవ్వలేక ఇబ్బంది పడిన లబ్ధిదారులు, అర్హత ఉన్నా దరఖాస్తు కూడా చేయలేక అవస్థ పడిన ఒంటరి మహిళలు.. వలంటీర్ వ్యవస్థ సాయంతో సకాలంలో పింఛన్లు అందుకుంటున్నారు. అందుకు సాక్షి ఈ ఒకటో తేదీ.

– శ్రీకాకుళం పాతబస్టాండ్/ జి.సిగడాం/గార/ నరసన్నపేట/ జలుమూరు/ టెక్కలి



● పేదోడి ఇంటిలో వెలుగు

ఇతని పేరు తొత్తరి రాజు. జి.సిగడాం గ్రామం. పుట్టినప్పటి నుంచి రెండు కాళ్లు పనిచేయవు. తల్లి రమణమ్మ కూలీనాలీ చేసి రాజును పోషించుకునేది. గత ప్రభుత్వంలో పింఛన్ కోసం నానా ఇబ్బందులు పడ్డారు. జగనన్న అధికారంలో వచ్చిన వెంటనే వికలాంగుల కోటా కింద రూ.3 వేలు మంజూరు చేశారు. దీంతో తల్లీకొడుకులు ఆనందంగా జీవిస్తున్నారు. ఈ అబ్బాయికి వేలిముద్ర పడదు. దీంతో సచివాలయం డిజిటల్ అసిస్టెంట్ పాగిరి రాము, వెల్ఫేర్ అసిస్టెంట్ భవ్యశ్రీ, వలంటీరు మజ్జి లక్ష్మి సమక్షంలో ఒకటో తేదీనే ఇంటికి వెళ్లి పింఛన్ అందించారు.

నాడు: టీడీపీ హయాంలో పింఛను కావాలంటే జన్మ భూమి కమిటీలు కరుణించాలి. కరుణించాక వారికి వాటా ఇవ్వాలి. ఇచ్చాక ఆ పార్టీకే ఓటు వేయాలని చెప్పాలి. ఇన్ని చేస్తే గానీ ఒక అర్హుడికి పింఛన్ చేతికి అందేది కాదు.

నేడు: అర్హత ఉంటే చాలు పింఛన్ దరఖాస్తు నుంచి మంజూరు వరకు అన్నీ చకచకా జరిగిపోతున్నాయి. జిల్లాలో గురువారం పింఛన్ల పంపిణీ మొదలైంది. వివిధ రకాల పింఛన్ల కోసం రూ.94.73కోట్లు కేటాయించారు.

తొలిరోజు ఇలా..

పింఛన్లు గురువారం రాత్రి 9.30 గంటల వరకు **81.28**శాతం మందికి అందజేశారు.

మొత్తం **3,24,316** మందికి పింఛన్లు అందజేయాల్సి ఉండగా మొదటి రోజు **2,63,609** మందికి అందాయి.

● జీతం మాదిరిగానే..

ప్రతి నెలా ఒకటో తేదీకే ఉద్యోగులకు వచ్చేలా మాకు వలంటీర్ పింఛను డబ్బు ఇస్తున్నారు. మా ఇంటిలో నేను, నాబిడ్డ ఉంటున్నాం. ఇద్దరికీ సరిపడా కిరాణా సరుకులు తెచ్చుకుంటాం. రేషన్ బియ్యం 10 కేజీలు వస్తాయి. మరో 15 కేజీల బియ్యం నెలకు అవసరమవుతాయి. ఈ బియ్యాన్ని కొనుక్కుంటాం. కరెంటు బిల్లు కూడా ఈ డబ్బుతోనే కడుతున్నాం. గతంలో నా మందులకు రూ.600 ఖర్చు చేసేదాన్ని. ఇప్పుడు ఉచితంగానే ఇస్తున్నారు. నాకు పింఛన్ డబ్బు ఎంతో ఉపయోగపడుతోంది. దీంతో పాటు ఆసరా, చేయూత కూడా వస్తోంది. – ముళ్ల లక్ష్మి, యారబాడు ఐ కాలనీ, వితంతు పింఛన్ లబ్ధిదారు, నరసన్నపేట మండలం

● జగన్ బాబు దయతోనే..



నా ఇద్దరు పిల్లలు చనిపోయారు. నా భర్త కూడా కొన్నేళ్ల కిందటే మృతి చెందారు. నాకు నా అన్నవారెవ్వరూ లేరు. చిన్న పూరి గుడిసె కూడా లేదు. నా జీవితం ఎలా గడుస్తుందో అని బెంగ పడేదాన్ని. పరాయి వాళ్ల ఇళ్లలో తల దాచుకునేదాన్ని. ఇప్పుడు ఆ బెంగలేదు. జగన్ బాబు దయతో ఇల్లు వచ్చింది. నెల మొదటి రోజునే రూ.3వేలు పింఛన్ ఇస్తున్నారు. నాలాంటి అభాగ్యులకు జగన్ ఒక దేవుడు. జగన్‌బాబుకు ఆ దేవుడు నిండు నూరేళ్ల ఆయుష్షు ఇవ్వాలి.

– నాగమ్మ, పాగోడు పంచాయతీ, జలుమూరు మండలం



శ్రీకాకుళంలోని 15వ వార్డులో డి పుండరీకాక్షకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ పావని

● ఓ గొప్ప భరోసా..



నాకు ఐదేళ్ల కిందట కిడ్నీలు పాడయ్యాయి. అప్పట్లో వైద్యానికి ఎన్నో ఇబ్బందులు పడేవాళ్లం. నిరుపేద కుటుంబం కావడంతో నా కుమారులు తెచ్చిన కూలి డబ్బులు ఇంటిల్లిపాది జీవనానికే సరిపోయేవి. నా మందుల ఖర్చులకు ప్రతి నెలా ఎన్నో తిప్పలు పడేవాళ్లం. ఇప్పుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చిన తర్వాత నాలాంటి డయాలసిస్ రోగులకు ప్రతి నెలా రూ.10 వేలు పింఛన్ ఇస్తున్నారు. ఈ పింఛన్ డబ్బులు నాకు ఎంతో ఆసరాగా నిలుస్తున్నాయి. ప్రతి నెలా ఒకటో తేదీన మా వలంటీర్ ఇంటికి వచ్చి మరీ పింఛన్ ఇస్తున్నారు. ఇంతకంటే మాకేం కావాలి.

– కోనారి కర్రెయ్య, దయాలసిస్ పింఛన్ లబ్ధిదారుడు, అక్కవరం, టెక్కలి మండలం

● అప్పుడు రాజన్న.. ఇప్పుడు జగన్‌బాబు



నేను రామచంద్రాపురం శిమ్మపేటలో మా బంధువుల ఇంటిలో ఓ గదిలో ఉంటున్నాను. వయసు రీత్యా ఏ పనీ చేయలేను. నాకు రాజన్న సీఎంగా ఉండగా పింఛన్ మంజూరైంది. ఇప్పుడు జగన్ బాబు ప్రతి నెలా ఒకటో తేదీనే మా ఇంటికి రూ.3వేలు పంపిస్తున్నాడు. వలంటీరు ఇంటికి వచ్చి మరీ డబ్బులిస్తున్నాడు. గతంలో పంచాయతీ కార్యాలయం వద్ద మమ్మల్ని పిలిచేంత వరకు కూర్చునే ఉండేవాళ్లం. ఇప్పుడు ఆ కష్టాలు లేవు.

– జల్లువలస అప్పలనర్సమ్మ, ఒంటరి మహిళ పింఛన్ లబ్ధిదారు, శిమ్మపేట, గార మండలం

పరీక్షల పర్వానికి శ్రీకారం



జిల్లాలోని ఓ ప్రభుత్వ కళాశాలలో పరీక్ష నిర్వహణకు సిద్ధం చేసిన ఫర్నీచర్

శ్రీకాకుళం న్యూకాలనీ: ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి శుక్రవారంతో పరీక్షల పర్వం మొదలుకానుంది. ఈనెల 2, 23 తేదీల్లో జరిగే ఈ తప్పనిసరి పరీక్షలకు ఫస్టియర్ విద్యార్థులు విధిగా హాజరై ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది. అలాగే ఈనెల 5 నుంచి ఇంటర్ సెకెండియర్ ఒకేషనల్ కోర్సుల విద్యార్థులకు ప్రాక్టికల్స్ మొదలుకానుండగా, ఈనెల 11 నుంచి జనరల్ కోర్సుల సెకెండియర్ సైన్స్ విద్యార్థులకు ప్రాక్టికల్స్ ఆరంభంకానున్నాయి. అలాగే మార్చి ఒకటో తేదీ నుంచి ఇంటర్మీడియెట్ థియరీ పబ్లిక్ పరీక్షలు జరగనుండగా, మార్చి 18వ నుంచి పదో తరగతి పరీక్షలు జరగనున్న విషయం తెలిసిందే. ఇంటర్ ఫస్టియర్ విద్యార్థులకు శుక్రవారం నైతికత మరియు మానవతా విలువలు (ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్) పరీక్ష జరగనుంది. అలాగే శనివారం పర్యావరణ విద్య (ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్) పరీక్ష నిర్వహించాల్సి ఉన్నా 23వ తేదీకి అది వాయిదా పడింది. ఈ రెండు పరీక్షలు ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరగనున్నాయి. జిల్లాలోని అన్ని యాజమాన్య జూనియర్ కళాశాలల్లో ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థులతోపాటు గతంలో ఈ రెండు పరీక్షలు రాయని/ఉత్తీర్ణులుకాని విద్యార్థులు కూడా పరీక్షలు విధిగా రాయాల్సి ఉంటుంది. వారు చదువుకున్న కళాశాలల్లోకే హాజరై పరీక్షలు రాయాల్సి ఉంటుందని అధికారులు సూచిస్తున్నారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లను పూర్తి చేశారు.


'మైనర్లను కారాగారంలో ఉంచవద్దు'



రికార్డులను తనిఖీ చేస్తున్న సన్యాసినాయుడు

గార: ప్రస్తుత పరిస్థితుల్లో మైనర్లు కూడా జైలుకు వస్తున్నారని, వారిని కారాగారంలో బంధించకుండా చిన్నపిల్లలను ఉంచే ప్రత్యేకమైన హోమ్‌లో ఉంచేలా చర్యలు చేపట్టాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు జైలు అధికారులకు సూచించారు. శుక్రవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా సూచనలపై అంపోలు జిల్లా జైలును ఆయన సందర్శించారు. జైలులోని ఖైదీలతో వ్యక్తిగతంగా మాట్లాడి వారి వయసు, జైలు పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అవసరమైతే న్యాయవాదులను ఉచితంగా ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుని, న్యాయ సహాయాన్ని అందిస్తామన్నారు.

కేంద్ర 'పద్దు'పై నిరాశ



- కేంద్ర బడ్జెట్‌పై జిల్లా వాసుల అసంతృప్తి
- జిల్లాకు ఒరిగిందేమీ లేదంటున్న మేధావులు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై జిల్లా వాసులు నిరాశ వ్యక్తం చేస్తున్నారు. ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో మన రాష్ట్రాన్ని, మన జిల్లాను విస్మరించడంపై అన్ని వర్గాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. నిత్యావసరాల ధరలు తగ్గించకపోవడం, పన్ను మినహాయింపుపై ప్రకటనలు లేకపోవడం సామాన్యుడిని నిరాశపరిచింది. మరీ ముఖ్యంగా జిల్లాలోని రైల్వేస్టేషన్లు ఈ బడ్జెట్‌పైనే ఆశలు పెట్టుకోగా.. ఎలాంటి కేటాయింపులు లేకపోవడం తీవ్ర విస్మయానికి గురి చేసింది.

సామాన్యుడిని విస్మరించారు



2024 ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ సామాన్యులు, మధ్య తరగతిని విస్మరించింది. పెట్రోల్, డీజిల్, గ్యాస్ వంటి ధరలు తగ్గుతాయని ఆశించినా తగ్గించలేదు. ప్రపంచ మార్కెట్‌లో పెట్రోల్ బ్యారెల్ ధర తగ్గినప్పటికీ కనీసం స్పందించలేదు. ఉద్యోగుల ఆదాయ పన్ను మినహాయింపు సైతం లేదు.

– ప్రొఫెసర్ హనుమంతు లజపతిరాయ్, పూర్వపు వైస్ చాన్స్‌లర్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం

వేతన జీవులకు మొండిచేయి



2024 ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ వేతన జీవులకు మొండిచేయి చూపించింది. సాధారణ ఎన్నికల ముందు బడ్జెట్‌పై సామాన్యులు ఎన్నో ఆశలు పెట్టుకుంటారు. ఆదాయ పరిమితిపై ఎదురు చూశారు. కానీ ఏవీ చేయలేదు. ఎన్నికలు దృష్టిలో పెట్టుకుని కొన్ని వర్గాలు, ప్రాంతాలకు ప్రయోజనాలు కల్పిస్తూ నిర్ణయం తీసుకున్నారు. సామాన్యులను దృష్టిలో పెట్టుకోలేదు.

– డాక్టర్ ఎంపీ సూరిగణేష్, అసిస్టెంట్ ప్రొఫెసర్, ఆర్‌జీయూకేటీ, శ్రీకాకుళం క్యాంపస్

భల్లూకాల బీభత్సం



- ఉద్దానంలో మరోసారి ఎలుగు దాడి
- వేర్వేరు చోట్ల నలుగురికి గాయాలు
- ఆందోళనలో జీడి రైతులు

వజ్రపుకొత్తూరు రూరల్: ఉద్దానం మరోమారు ఉలిక్కిపడింది. గతంలో జరిగిన ఎలుగుబంటి దాడుల భయం ఇంక వీడకమునుపే గురువారం మళ్లీ మరోసారి భల్లూకాలు బీభత్సం సృష్టించాయి. మండలంలోని చీపురపల్లి పంచాయతీ పరిధిలో గల ఎం.గడూరు, డెప్పూరు జీడి తోటల్లో గురువారం జరిగిన ఎలుగు దాడి సంఘటనలో నలుగురు గాయపడ్డారు.

ఎం.గడూరు గ్రామానికి చెందిన మత్స్యకారుడు పిన్నాసి కుమారస్వామి ఉదయం సముద్ర వేట చేస్తూ ఇంటికి వస్తున్న సమయంలో ఎలుగు ఒక్కసారిగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. అలాగే డెప్పూరు గ్రామానికి చెందిన లైశెట్టి నారాయణమ్మ పరిసర జీడి తోటకు రేగిపండ్లు సేకరించేందుకు వెళ్తున్న సమయంలో వెనుక నుంచి ఒక్కసారిగా రెండు ఎలుగులు దాడి చేయడంతో ముఖంపై తీవ్రగాయాలయ్యాయి. అలాగే అదే గ్రామానికి చెందిన జీడి రైతులు సీలం తాతారావు, పి.ఉర్మిల జీడి తోటలకు రక్షణ కంచె ఏర్పాటు చేస్తున్న తరుణంలో ఎలుగులు దాడి చేశాయి. బాధితుల చేతికి రక్షణ గ్లౌజులు, ఆయుధాలు ఉండటంతో స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఈ ఎలుగు దాడుల్లో తీవ్రంగా గాయపడిన పిన్నాసి కుమారస్వామి, లైశెట్టి నారాయణమ్మలను స్థానికులు ప్రైవేట్ వాహనంలో పలాస ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో వైద్యులు చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కి తరలించారు.



నారాయణమ్మకు చికిత్స అందిస్తున్న వైద్యులు

కాపాడిన పెంపుడు కుక్కలు

ఎలుగు దాడి చేస్తున్న సమయంలో స్థానికుడు పి.చలపతి రావు తన పెంపుడు కుక్కలతో గడూరు రావడంతో ఎలుగును గమనించిన కుక్కలు ఎలుగు వైపు అరుస్తూ దూసుకెళ్లాయి. దీంతో ఎలుగు అక్కడి నుంచి పారిపోయింది. దీంతో బాధితుడు కుమారస్వామి ప్రాణాపాయం నుండి బయటపడినట్లు స్థానికులు తెలిపారు.

వణుకుతున్న ఉద్దానం



చికిత్స పొందుతున్న బాధితుడు కుమారస్వామి

ఉద్దానం, తీర ప్రాంతంలో ఎలుగులు పగలు,రాత్రి అని తేడా లేకుండా సంచరిస్తున్నాయి. తారస పడిన ప్రజలపై దాడులు చేస్తూ ప్రాణాలను తీస్తున్నాయి. రెండేళ్ల క్రితం కిడిసింగి గ్రామానికి చెందిన జీడి రైతు ఎలుగు దాడిలో మృత్యువాత పడ్డారు. అలాగే వజ్రపుకొత్తూరు గ్రామానికి చెందిన ఐదుగురు వ్యక్తులపై దాడి చేసి తీవ్రంగా గాయపరచడంతో అందులో ఇద్దరు మరణించారు. ఈ సంఘటనలు ప్రజలు మరువక ముందే నేడు మరో ఎలుగు దాడి సంఘటన ఉద్దానంలో చోటు చేసుకోవడంతో జీడి రైతులు ప్రాణ భయంతో వణికిపోతున్నారు. వారి ప్రధాన జీవనాధారమైన జీడి పంట పూత, పిందె దశలో ఉండడంతో తోటలకు వెళ్లక తప్పని పరిస్థితి. అయితే తమ కళ్ల ముందే ఎలుగులు దాడులు చేస్తుండటంతో వారు ఆందోళన చెందుతున్నారు. ఎలుగులను నియంత్రించాలని అటవీ శాఖాధికారులను కోరుతున్నారు. ఈ విషయంపై కాశీబుగ్గ ఫారెస్ట్ రేంజర్ మురళీకృష్ణ నాయుడుని సంప్రదించగా ఎలుగులు కవ్వింపు చర్యలకు పాల్పడరాదని, అలాగే జీడి రైతులు వారితో పాటు రక్షణ కోసం ఆయుధాలను తీసుకువెళ్లాలని, ఒంటరిగా తోటలకు వెళ్లరాదని సూచించారు. ఎలుగుల సంచార సమాచారాన్ని తమకు తెలియజేయాలని అన్నారు.

డీఎస్‌ఓ వెంకటరమణకు బదిలీ

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా సివిల్ సప్లయి అధికారి డి. వెంకటరమణకు బదిలీ అయ్యింది. ఈ మేరకు గురువారం ఉత్తర్వులు వచ్చాయి. ఈయన గత రెండేళ్లుగా జిల్లా పౌరసరఫరాల అధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆయనను నెల్లూరు జిల్లా డీఎస్‌ఓగా నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఇన్‌చార్జి డీఎస్‌ఓగా ఐసీడీఎస్ పీడీ బి.శాంతిశ్రీని నియమించారు. ఈమె గురువారం విధుల్లో చేరారు.

మినిస్ట్రీ ఆఫ్ కార్పొరేట్ అఫైర్స్‌లో సిక్కోలు మార్క్

- ఢిల్లీలోని సెంట్రల్ రిజిస్ట్రేషన్ సెంటర్‌లో నాయకత్వం వహిస్తున్న జిల్లా వాసి మెట్ట రవికుమార్
- అద్భుత పనితీరుతో ప్రత్యేక గుర్తింపు
- రాష్ట్రపతి ప్రశంస అందుకున్న వైనం

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం : సిక్కోలుకు చెందిన యువకుడు ఢిల్లీలోని మినిస్ట్రీ ఆఫ్ కార్పొరేట్ అఫైర్స్‌లో తనదైన ముద్ర వేసుకున్నారు. శ్రీకాకుళానికి చెందిన మెట్ట రవికుమార్ సెంట్రల్ రిజిస్ట్రేషన్ సెంటర్‌లో డిప్యూటీ రిజిస్ట్రీ ఆఫ్ కంపెనీగా పనిచేస్తూ ప్రత్యేక గుర్తింపు పొందుతున్నారు. కమల్ హర్జానీ అనే అధికారితో కలిసి మెట్ట రవికుమార్ ఆ శాఖకే వన్నె తెచ్చారు. వీరి నాయకత్వంలో 2023లో దేశంలో అత్యధికంగా లక్షా 60వేల కంపెనీల ప్రారంభానికి అనుమతులిచ్చి చరిత్ర సృష్టించారు. వీరి నాయకత్వంలో మంచి పనితీరు కనబరిచిన శాఖను పార్లమెంట్ ఉభయ సభల బడ్జెట్ సమావేశంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రత్యేకంగా ప్రస్తావించారు. గతంలో ఒక కంపెనీకి అనుమతులివ్వాలంటే 15రోజులు దాటేది. ఇప్పుడా పరిస్థితి లేకుండా కేవలం ఒకటి రెండు రోజుల్లోనే అనుమతులిచ్చి కంపెనీల ఏర్పాటుకు ఇతోధికంగా కృషి చేస్తున్నారు. పదేళ్ల క్రితం సంవత్సరానికి 100కంపెనీలకు అనుమతులిచ్చిన సందర్భం నుంచి ఈ రోజు లక్షా 60వేల కంపెనీలకు అనుమతులివ్వడం దేశం ఘనతగా చెప్పుకుంటున్నారు. అలాంటి శాఖలో మన జిల్లాకు చెందిన 2016సివిల్ సర్వీసు బ్యాచ్‌కు చెందిన మెట్ట రవికుమార్ ఉండటం గర్వకారణం.



మెట్ట రవికుమార్

క్లుప్తంగా

జాతీయ తైక్వాండో పోటీలకు రిఫరీగా గౌతమ్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని రాయ్‌పూర్‌లో ఈ నెల 2వ తేదీ నుంచి 4వ తేదీ వరకూ జరగనున్న 37వ జాతీయ సబ్ జూనియర్ కొర్గీ, 12వ జాతీయ సబ్ జూనియర్ పూమ్ సే తైక్వాండో చాంపియన్ షిప్ పోటీలకి నేషనల్ రిఫరీగా శ్రీకాకుళానికి చెందిన మజ్జి గౌతమ్ నియమితులయ్యారు. దీంతో గౌతమ్‌ను కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అభినందించారు. భవిష్యత్ లో కూడా మరింత ఉన్నత స్థానానికి చేరుకోవాలని, జిల్లాకి చెందిన క్రీడాకారులు రాణించేలా శిక్షణలు అందించాలని ఆయన కోరారు.

4న రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలు

కంచిలి: మండలంలోని గోకర్ణపురం గ్రామంలో 'మీతో' టీం వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 4వ తేదీ ఆదివారం ఉదయం 10గంటలకు రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలు నిర్వహించనున్నామని నిర్వాహకులు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఎలాంటి ఎంట్రీ ఫీజు లేకుండా ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఏటా రిపబ్లిక్ దినోత్సవం సందర్భంగా నిర్వహించే ఈ క్విజ్ పోటీలు ఈ ఏడాది ఫిబ్రవరి 4వ తేదీన నిర్వహిస్తున్నారు. ఈ పోటీల్లో పాల్గొనే వారికి తెలుగు, సైన్స్, సోషల్, జీకే అండ్ కరెంట్ అఫైర్స్, ఫొటో క్విజ్, రాపిడ్ ఫైర్ రౌండ్లు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో పాల్గొనడానికి ఎలాంటి వయోపరిమితి లేదని, రిజిస్ట్రేషన్ కోసం ఫోన్ నంబర్ 9493577544ను సంప్రదించాలని సూచించారు.

'భవనం సకాలంలో పూర్తిచేయాలి'



పరిపాలన భవనం నిర్మాణం పరిశీలిస్తున్న వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ కేఆర్ రజిని

ఎచ్చెర్ల క్యాంపస్: నిర్మాణంలో ఉన్న పరిపాలన భవనం సకాలంలో పూర్తిచేయాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ కేఆర్ రజిని అన్నారు. రూ. 35.82 కోట్లతో నిర్మిస్తున్న ఈ భవనం నిర్మాణం కాంట్రాక్టు గడువు మార్చి 8వ తేదీ కాగా భవనం నిర్మాణ ప్రస్తుత పరిస్థితి, ఇంటీరియల్ నిర్మాణం, నాణ్యత పరిశీలించారు. భవనం మార్చిలో వినియోగంలోకి రావాలని చెప్పారు. పనులు నిర్వహిస్తున్న కేంద్ర ప్రజా పనుల విభాగం కాంట్రాక్టు సిబ్బంది, సూపర్‌వైజర్లతో ప్రస్తుత స్థితి అడిగి తెలుసుకున్నారు. ఫిబ్రవరి నెల చివరి నాటికి పనులు పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు వీరు వెల్లడించారు. ఆమె వెంట రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య, వర్సిటీ ఇంజినీర్ అంజిత్‌కుమార్ ఉన్నారు.

లారీ డ్రైవర్‌కు తీవ్ర గాయాలు



డ్రైవర్‌ను బయటకు తీస్తున్న సిబ్బంది

టెక్కలి రూరల్: స్థానిక ఆదిఆంధ్ర వీధి సమీపంలో గల జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. ఈ మేరకు స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. హరియాణాకు చెందిన లారీ డ్రైవర్ లుక్‌మాన్ ఖాన్ పలాస నుంచి టెక్కలి వైపు వస్తూ స్థానిక ఆదిఆంధ్ర వీధి సమీపంలోకి వచ్చే సరికి తన లారీకి ముందువెళ్తున్న లారీని అతి వేగంగా ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ వైపు ఉన్న క్యాబిన్ పూర్తిగా లోపలకు పోవడంతో అందులో డ్రైవర్ ఇరుక్కుపోయాడు. సమాచారం అందుకున్న హైవే పోలీసులు హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకుని స్థానికుల సాయంతో డ్రైవర్‌ను బయటకు తీశారు. అనంతరం టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి శ్రీకాకుళం రిమ్స్‌కు పంపించారు. ఈ ఘటనపై టెక్కలి పోలీసులు వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు.

హిమ ప్రతాపం

మంచు ముంచుతోంది. సంక్రాంతి ముగిశాక చలి ప్రభావం తగ్గాల్సి ఉన్నా.. ఇంకా పెరుగుతుండడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. మరీ ముఖ్యంగా వేకువ జామున రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది.

– శ్రీకాకుళం క్రైమ్



చలిమంచులో చెత్త సేకరణ



చలిమంచులో గడ్డి బండి



అప్పన్నమ్మ గుడి సమీపంలో..



శ్రీకాకుళంలో వేకువనే వాలీబాల్ ఆట



ఉదయం ఏడుగంటల సమయంలో మంచుపొరల మధ్య సూరీడు



మంచులో చలిమంట కాగుతూ..



శ్రీకాకుళంలో మంచులో విధులు

చంద్రబాబుది గురివింద నీతి

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్



పోలాకి ప్రభుత్వ పాఠశాలలో అదనపు గదులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కృష్ణదాస్

పోలాకి: నేటి రాజకీయాల్లో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడిది గురివింద నీతి అని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. ఆయన గురువారం జిల్లా పోలాకి మండలంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వానికి విద్య, వైద్యం, వ్యవసాయం అత్యంత ప్రాధాన్యం కావటంతో ఆ దిశగా అనేక చారిత్రాత్మక అడుగులు పడ్డాయని అన్నారు. దీంతో ప్రజల్లో బలమైన ప్రజానాయకుడిగా జగన్‌కు ముద్రపడిందని, అది ఆ పెద్దమనిషికి నచ్చటం లేదని చంద్రబాబును ఉద్దేశించి అన్నారు. ఆయన రాజకీయ జీవితం అంతా కుట్రలు, కుతంత్రాలతోనే గడిపారని, ఏ ఒక్కసారి సొంతంగా ఎన్నికలకు వెళ్లని నాయకుడు చంద్రబాబు అని విమర్శించారు. పేదలకోసం ఎందాకైనా వెళ్లేందుకు తాము 'సిద్ధం' అని కృష్ణదాస్ పదేపదే చెప్పటంతో సభ చప్పట్లతో మారుమోగింది. పాఠశాల విద్య ఏపీసీ జయప్రకాశ్ మాట్లాడుతూ జిల్లాలో మొదటిదశలో 1247 పాఠశాలలు, రెండో దశలో 1058 పాఠశాలలు, 38 జూనియర్ కళాశాలల్లో నాడు–నేడు ద్వారా పెద్ద ఎత్తున మౌలిక వసతులు, అదనపు భవనాల నిర్మాణం చేపట్టామని తెలిపారు. పోలాకి పాఠశాల సాంకేతిక కారణాలతో తొలుత నిలిచిపోయినా తర్వాత మిగులు నిధులతో పనులు వేగంగా జరిగాయన్నారు. మరిన్ని నిధులు అందించి పోలాకి పాఠశాలను ఆదర్శంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జి, జెడ్పీటీసీ సభ్యుడు ధర్మాన కృష్ణచైతన్య, మండలపరిషత్ సలహాదారు ముద్దాడ భైరాగినాయుడు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యలో అనేక మార్పులతో పాటుగా తాజాగా ఐబీ సిలబస్ కూడా తీసుకువచ్చారని గుర్తు చేశారు. ఒక్క పోలాకి పంచాయతీలో వివిధ పాఠశాలలకు రూ.3.87కోట్లు నాడు–నేడు పనులు జరిగాయని తెలిపారు.

అంతకు ముందు ఈదులవలసలో హెల్త్‌క్లినిక్ భవనం, ఈదులవలస జంక్షన్‌లో ప్రయాణికుల విశ్రాంతి భవనం, కొండలక్కివలస బీటీ రోడ్డులను ఎమ్మెల్యే కృష్ణదాస్ ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మజ్జి రమణమ్మ, ఏఎంసీ చైర్మన్ దుంపల భాస్కరరావు, మండలపార్టీ అధ్యక్షుడు కణితి కృష్ణారావు తోపాటు పలువురు నాయకులు, పాఠశాల, జూనియర్ కళాశాలల సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు నైపుణ్య శిక్షణలు



బీఆర్ఏయూ వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజనీకి నైపుణ్య శిక్షణల వివరాలు అందజేస్తున్న సీటీఎంసీ ప్రతినిధి చంద్రకాంత్

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థులకు నైపుణ్య శిక్షణలు అందజేయనున్నట్లు ముంబైకి చెందిన సెంటర్ ఫర్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్ కన్సల్టెన్సీ అకాడమీ ప్రతినిధి చంద్రకాంత్ వర్మ అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కె.ఆర్.రజినీని గురువారం ఆయన కలిశారు. ఈ సందర్భంగా తమ సంస్థ అందజేస్తున్న నైపుణ్య శిక్షణల వివరాల బ్రోచర్‌ను అందజేశారు. సాఫ్ట్ స్కిల్స్, డిజటల్ మార్కెటింగ్, ఇంటీరియల్ డిజైనింగ్, వెబ్‌డిజైనింగ్, ఈ–కామర్స్ వ్యాపార స్కిల్స్, బిజినెస్ అనలెటిక్స్, డేటా సైన్స్ వంటి కోర్సుల్లో గత 30 ఏళ్లగా తమ సంస్థ శిక్షణలు ఇస్తోందని అన్నారు. ఎంబీఏ, ఎంసీఏ, ఇంజినీరింగ్, పీజీ విద్యార్థులకు ఈ శిక్షణలు ఇవ్వటం వల్ల ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకుంటారని తెలిపారు. విశ్వవిద్యాలయంలో తమ సేవలు అందించటం, కలిసి పనిచేసేందుకు ఆసక్తిగా ఉన్నట్లు చెప్పారు. పాలక మండలి, ఉన్నత విద్యాశాఖ అధికారులతో చర్చించి, ఒప్పందంపై నిర్ణయం తీసుకుంటామని అన్నారు.

కొట్లాటపై కేసు నమోదు

మెళియాపుట్టి: మండలంలోని వసుంధర గ్రామంలో బుధవారం రాత్రి జరిగిన కొట్లాటలో ఎనిమిది మంది కలిసి జానం లక్ష్మీపతి అనే వ్యక్తిని గాయపరిచారు. ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు మెళియాపుట్టి పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా గురువారం టెక్కలి డీఎస్పీ బాల చంద్రారెడ్డి, పాతపట్నం సీఐ నల్లి సాయి వసుంధర గ్రామాన్ని సందర్శించి కొట్లాటకు సంబంధించి దర్యాప్తు నిర్వహించారు. ఎస్‌ఐ రాజేష్ మాట్లాడుతూ వసుంధర గ్రామంలో గ్రామదేవత ఆలయం పునర్నిర్మాణంలో భాగంగా మాటామాటా పెరిగి గ్రామానికి చెందిన సలాన వినోద్, బాడాన కృష్ణారావు, సలాన మహేష్, సలాన పృథ్వీ, బొచ్చు శరత్, తులసి తేజేశ్వరరావు, బాడాన రాజేష్, సలాన వెంకటరావు కలిసి దాడికి దిగినట్లు తెలిపారు.

వైద్యారోగ్యశాఖలో ఇద్దరిపై సస్పెన్షన్ వేటు

అరసవల్లి: జిల్లా వైద్యారోగ్య శాఖలో సంచలనంగా మారిన తప్పుడు ఫిర్యాదుల లేఖలు, ఉద్యోగ నియామకాల్లో అక్రమ వసూళ్ల అంశంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ విషయంలో కీలకంగా భావిస్తున్న సూపరింటెండెంట్లు భాస్కర్ కుమార్, శ్రీనివాసాచార్యులను విధుల నుంచి సస్పెండ్ చేస్తూ వైద్యశాఖ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ బి.సుజాత గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. వైద్యశాఖలో అక్రమ వ్యవహారాలపై గత నెల 23న 'సాక్షి'లో 'వైద్యారోగ్య శాఖలో రచ్చ రచ్చ' పేరిట కథనం ప్రచురించింది. దీన్ని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ సీరియస్‌గా తీసుకుని వెంటనే డీఎంహెచ్‌ఓ కార్యాలయ సూపరింటెండెంట్ డి.భాస్కర్‌కుమార్, జిల్లా జనరల్ ఆస్పత్రి ప్రస్తుత సూపరింటెండెంట్ ఐవీఎస్ ఆచార్యలను విధుల నుంచి సస్పెండ్ చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

ఈ మేరకు గురువారం వైద్యశాఖ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ బి.సుజాత స్పందిస్తూ అక్రమాల వ్యవహారంపై విచారణ కొనసాగిస్తూనే వీరిద్దరినీ తక్షణమే విధుల నుంచి సస్పెండ్ చేస్తున్నట్లుగా ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విషయాన్ని డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.మీనాక్షి ధ్రువీకరించారు. అలాగే ఈ అంశంపై విచారణ కూడా కొనసాగించాలని ఆమె ఆదేశించారు.

మహేంద్రతనయ నదిపై కాజ్‌వే నిర్మాణం

- రూ.40లక్షలు విడుదల చేసిన ప్రభుత్వం
- ఎమ్మెల్యే రెడ్డి శాంతి



ప్రభుత్వ అనుమతి పత్రాలు ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి తదితరులు

ఎల్.ఎన్.పేట: పాతపట్నం మండలంలోని గంగువాడ నుంచి గోపాలపురం వెళ్లేందుకు మహేంద్రతనయ నదిపై కాజ్‌వే రోడ్డు నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.40 లక్షల నిధులను విడుదల చేసినట్లు పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి గురువారం తెలిపారు. మహేంద్రతనయ నది దాటి వెళ్లేందుకు ఆయా గ్రామాల ప్రజలతో పాటు పొలం పనులకు వెళ్లేందుకు రైతులు అనేక ఇబ్బందులు పడుతుండేవారు. సమస్యను స్థానికులు తన దృష్టికి తీసుకుని వచ్చారని ఎమ్మెల్యే రెడ్డి శాంతి తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌కు ఈ సమస్య గురించి వివరించానని, దానికి స్పందించిన సీఎం జగనన్న రూ.40 లక్షల నిధులను విడుదల చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం నుంచి పరిపాలన, ఆర్థిక పరమైన అనుమతి లభించటంతో ప్రస్తుతం టెండర్ల దశకు చేరుకుందన్నారు. టెండర్ల ప్రక్రియ పూర్తయిన వెంటనే నిర్మాణ పనులు చేపడతారని తెలిపారు. డీఎంఎఫ్ విభాగం నుంచి విడుదలైన నిధులతో శ్రీకాకుళం పీఐయూ విభాగం ఇంజినీరింగ్ ఆధికారులు నిర్మాణ పనులు చేపడతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీసీసీ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.శ్యామసుందరరావు, పాతపట్నం ఏఎంసీ చైర్మన్ కొండాల అర్జునరావు, మెళియాపుట్టి పీఏసీఎస్ అధ్యక్షుడు ఊర్లాన బాలరాజు పాల్గొన్నారు.

డీఎస్పీలకు స్థానచలనం

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాలో పలువురు డీఎస్పీలను బదిలీ చేస్తూ ఏపీ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ కేవీ రాజేంద్రనాథ్ రెడ్డి నుంచి గురువారం ఉదయం ఉత్తర్వులు అందాయి. ఈ బదిలీల్లో జిల్లా నుంచి ముగ్గురు డీఎస్పీలు బయటకు వెళ్లనుండగా ఇద్దరు డీఎస్పీలు రానున్నారు.

డీఎస్పీలు	ప్రస్తుతం పనిచేస్తున్న స్థానం	బదిలీ అయిన స్థానం
ఎస్.వాసుదేవ్	దిశా, శ్రీకాకుళం	దిశా, విజయనగరం
సీహెచ్‌జీవీ ప్రసాదరావు	ట్రాఫిక్, శ్రీకాకుళం	ఏసీపీ, టాస్క్‌ఫోర్స్ విశాఖ
కె.బాలరాజు	ఎస్‌బి, శ్రీకాకుళం	మెరైన్, విశాఖపట్నం
ఆర్.శ్రీనివాసరావు	దిశా, విజయనగరం	దిశా, శ్రీకాకుళం
ఎ.త్రినాథరావు	టాస్క్‌ఫోర్సు, విశాఖ	ఎస్‌బి, శ్రీకాకుళం

డయల్ యువర్ యూనివర్సిటీ రేపు

ఎచ్చెర్ల క్యాంపస్: డయల్ యువర్ యూనివర్సిటీ ఫోన్‌ఇన్ లైవ్ కార్యక్రమం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో ఈ నెల 3వ తేదీన నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య చెప్పారు. వర్సిటీలో గురువారం ఆయన మాట్లాడుతూ ఉదయం 10 నుంచి 11 గంటలు వరకు కార్యక్రమం ఉంటుందని అన్నారు. విద్యార్థులు సమస్యలు, సమాచారం కోసం ఫోన్ నంబర్ 82478 61919 ఫోన్ నంబర్‌కు ఫోన్ చెయ్యాలని అన్నారు.

వైఎస్సార్‌సీపీలో పలువురి చేరిక



గొల్లూరులో పార్టీ కండువాలు వేసి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్, ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్ తదితరులు



బారువ కొత్తూరులో పార్టీలో చేరిన వారికి పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న దృశ్యం

సోంపేట: మండలంలోని గొల్లూరు పంచాయతీ, బారువ పంచాయతీ బారువ కొత్తూరు గ్రామానికి చెందిన పలువురు టీడీపీ నాయకులు మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్, ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్ సమక్షంలో గురువారం పార్టీలో చేరారు. గొల్లూరు పంచాయతీకి చెందిన పి.అప్పలస్వామి, పి.శ్రీరాములు, జి.గంగారావు, సుద్ది తిరుపతి, గయా దశరథ, ఆకుల హిరంబు, అంకుల సాధానంద, భైరవ చిత్రసేన్, భైరవ మోహిని, గయా రామారావు, గుసిరి పాపయ్య, తదితర 12 కుటుంబాల సభ్యులు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి పిరియా సాయిరాజ్ పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

బారువ కొత్తూరులో

బారువ మేజర్ పంచాయతీ పరిధిలోని బారువ కొత్తూరు గ్రామానికి చెందిన గొరకల ఢిల్లీరావు, పిట్ల పోలయ్య, ఢిల్లి సూర్యనారాయణ, ఎస్.లింగరాజు, ఎస్.ఈశ్వరరావు, సర్వేపల్లి కోదండరావు, కదంబాల మోహన్, చొక్కా సూర్యనారాయణ, పిట్ల హేమరాజు, పెద్దింటి వల్లయ్య, డొంక పూర్ణావతి, కావలి గౌరమ్మ, చొక్కా హేమవతి తదితర 20 కుటుంబాలు పార్టీలో చేరాయి. వారికి పార్టీ కండువాలు వేసి పిరియా సాయిరాజ్ పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ నాయకుడు శిలగాన భాస్కరరావు, జేసీఎస్ కన్వీనర్ బుద్ధాన శ్రీకృష్ణ, మత్స్యకార డైరెక్టర్ మద్దు రాజారావు, వైస్ ఎంపీపీ గురాల శ్రీను,బారువ సర్పంచ్ యర్ర రజని, గొల్లూరు సర్పంచ్ పిన్నింటి ఈశ్వరరావు, పార్టీనాయకులు పెద్దింటి రాజేశ్వరరావు, జానకిరావు, రేఖారావు పార్టీనాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

'దుకాణదారులు, సంస్థలు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి'

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): జిల్లాలోగల అన్ని దుకాణాలు, సంస్థల యజమానులు ఆంధ్రప్రదేశ్ దుకాణాలు, సంస్థల చట్టం ప్రకారం మీ– సేవ ద్వారా, గ్రామవార్డు సచివాలయాల ద్వారా తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని జిల్లా ఉపకార్మికశాఖ కమిషనర్ ఎస్‌డీవీ ప్రసాదరావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. కార్మికులు ఉన్నా లేకున్నా రెన్యువల్ చేయించకపోతే వెంటనే రెన్యువల్ చేయించుకోవాలన్నారు. అపరాధ రుసుం, జరిమానాలు లేకుండా ఫిబ్రవరి నెలాఖరులోగా రిజిస్ట్రేషన్, రెన్యువల్ చేయించుకోవాలని కోరారు.

ఎలక్ట్రికల్ స్కూటీ దహనం

కంచిలి: కేసరపడ గ్రామానికి చెందిన కప్పల సోమయ్యకు చెందిన ఎలక్ట్రిక్ స్కూటీ దహనం చేసినట్లు గురువారం ఫిర్యాదు అందినట్లు స్థానిక ఎస్‌ఐ ఎస్. బాలరాజు తెలిపారు. ఈ స్కూటీతోపాటు గౌరి బిడ్డి మన్మథరావుకు చెందిన కేబుల్ వైర్లను కత్తిరించినట్లు తెలిపారు. ఈ స్కూటీని గ్రామ సమీపంలో గల పెసర పొలంలో దహనం చేసినట్లు గుర్తించారు. అదే గ్రామానికి చెందిన ఇప్పిలి సురేష్‌కుమార్‌ను అనుమానితుడిగా పేర్కొంటూ.. పాతకక్షల మూలంగా నష్టపరిచినట్లు బాధితుడు సోమయ్య ఫిర్యాదులో పేర్కొన్నారు.

వల.. కళకళ

వజ్రపుకొత్తూరు: మత్స్యకారుల కష్టం ఫలించింది. ఈ ఏడాది అరకొరగానే లభించిన కోనేం, ట్యూనా చేపలు గురువారం మంచినీళ్లపేట మత్స్యకారులకు పెద్ద మొత్తంలో చిక్కాయి. మార్కెట్‌లో ప్రస్తుతం కోనేం ధర అనుకూలంగా ఉండడంతో మత్స్యకారుల్లో ఆనందం రెట్టించింది. గురువారం వేకువ జామున ఏడు సంప్రదాయ బోట్లతో వేటకు వెళ్లిన స్థానిక మత్స్యకారులు సాయంత్రం 4 గంటల ప్రాంతంలో వేట ముగించుకుని తీరానికి చేరారు. ప్రతి బోటుకు దాదాపు 80 నుంచి 150 కిలోల వరకు కోనేం, ట్యూనా చేపలు చిక్కాయి. దీంతో ఆనందంలో తమ బోట్లును తీరం చేర్చారు. అనంతరం బోటులో ఉంచిన చేపలను కావడితో తీసుకొచ్చి స్థానిక వ్యాపారుల వద్ద ఉంచారు. అనంతరం ధర కోసం మత్స్యకారులకు, వ్యాపారులకు మధ్య ఒప్పందం కుదరడంతో నాలుగు కిలోల లోపు ఉన్న కోనేం(కొమరం మీనం) చేపలు కిలో రూ.550లు ధర పలకగా, ఆపైబడి బరువు ఉన్న కోనేం చేపలకు రూ.650 వరకు ధర పలికింది. దీంతో దాదాపు 1000 కిలోల కోనేం చేపలు, మరో 200 కిలోల ట్యూనా చేపలను దాదాపు రూ.6.50 లక్షలకు విక్రయించారు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో వీటి ధర రూ.800 వరకు పలుకుతుండగా, ట్యూనా చేపలు రూ. 250 వరకు ఉంటుందని మత్స్యకారులు చెబుతున్నారు. దీంతో ట్యూనా చేపలను కేరళ తరలించేందుకు, కోనేం చేపలను విశాఖపట్నం తరలించేందుకు స్థానిక వ్యాపారులు సిద్ధం చేశారు.



చేపలతో ఉన్న బోటును తీరానికి చేర్చుతున్న మత్స్యకారులు



బోటులో ఉంచిన చేపలను కావడితో మోసుకు వస్తున్న మంచినీళ్లపేట మత్స్యకారులు



స్థానిక వ్యాపారుల వద్ద కోనేం, ట్యూనా చేపలను తూకం వేసి విక్రయిస్తున్న మత్స్యకారులు